క్లుప్తంగా

యాదయ్య ప్రజల మనిషి



కద్చర్లలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రశాంత్‌గౌడ్

నవాబుపేట: ఎమ్మెల్యే యాదయ్య ప్రజల మనిషి అని ఆయన గెలిస్తే మండలం మరింత అభివృద్ధి చెందుతుందని ఏఎంసీ చైర్మెన్ ప్రశాంత్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కద్చర్ల, మాదారం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, కర్ణాటకలో ఆ పార్టీ ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బందయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, రత్న, రాజశేఖర్‌రెడ్డి, బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవాబుపేట: రైతు శ్రేయస్సే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ భవాని పేర్కొన్నారు. మండలంలోని మీనపల్లికలాన్, మాదారం గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కారు గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే యాదయ్యను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి జరిగిందన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్, రైతుబీమా, రైతుబంధు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లలను పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. మరోసారి యాదయ్యను గెలిపిస్తే నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జయమ్మ, నాయకులు అంజయ్య, శాంతకుమార్, ఎమ్మెల్యే కుమార్తె ప్రియాంక, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అవినీతిరహిత పాలన

కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్



బీజేపీలో చేరుతున్న యువకులకు పార్టీ కండువా కప్పుతున్న మారుతికిరణ్

కుల్కచర్ల: అవినీతిరహిత పాలన బీజేపీతో సాధ్యమని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ స్పష్టం చేశారు. గురువారం రాత్రి సక్రియానాయక్ తాండతో పాటు పరిసర తాండలలో యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మోసపూరిత మాటలు నమ్మి.. ఆ పార్టీలకు ఓటు వేయొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చౌడాపూర్ మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు బంధయ్య, జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి గోవింద్ నాయక్, మోత్కూరు సర్పంచ్ కేశవులు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

రిటర్నింగ్ అధికారి సాయిరాం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి సాయిరాం

నవాబుపేట: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని చేవెళ్ల ఆర్డీఓ(రిటర్నింగ్ అధికారి) సాయిరాం ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాల్లో వసతుల కల్పనపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 46 పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ర్యాప్‌లు, మరుగుదొడ్లు, మూత్రశాలలు తప్పకుండా ఉండాలన్నారు. ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించాడు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది శ్రీశైలం, పరమేశ్ తదితరులున్నారు.

'కుసుమ'కు ఆదరణ కరువు

- సాగుకు ఆసక్తి చూపని రైతులు
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి..
- అయినా తగ్గిన సాగు విస్తీరం



ఎన్కేపల్లిలో కుసుమ పంట (ఫైల్)

మోమిన్‌పేట: తక్కువ పెట్టుబడి, మోతాదు నీటితో సాగుచేసే పంటల్లో ఒకటి తెల్ల కుసుమ. దీన్ని పాడి నేలల్లో పండించవచ్చు. ఏక పంటగానే కాకుండా శనగ, ధనియాల్లో అంతర పంటగా సాగుచేసుకోవచ్చు. ఎన్నో ఔషధ గుణాలు ఉన్న కుసుమకు మార్కెట్లో డిమాండ్ ఉంది. తక్కువ పెట్టుబడితో పాటు అధిక దిగుబడి, అదే స్థాయిలో లాభాలు తెచ్చిపెట్టే పంటకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేక ఏటేటా సాగు తగ్గుముఖం పట్టినట్లు రైతులు చెబుతున్నారు. నిత్యం తినే ఆహారంలో కూరగాయలకు ప్రథమ స్థానం. అందులో వంట నూనే లేనిదే రుచి రాదు. అన్ని వంట నూనెల్లో కెల్లా శ్రేష్ఠమైనది తెల్ల కుసుమల నూనె. అంతటి ప్రాధాన్యమున్న కుసుమను రబీలో సాగు చేసేవారే కరువయ్యారు. ప్రభుత్వ ఆదరణ లేక పోవటంతో పాటు కూలీల కొరత, వాణిజ్య పంటలైన పత్తి, మొక్కజొన్న తదితర పంటలపై రైతులు మొగ్గు చూపడంతో.. మండల పరిధిలో కేవలం 40 ఎకరాలకు మించలేదు.

ప్రోత్సాహం లేక..

కుసుమ పూరేకులలో ఎన్నో ఔషధ గుణాలు ఉండటం, శ్రేష్టమైన వంట నూనే లభించడం లాంటి సాగును ప్రభుత్వం ప్రోత్సహించడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు. రబీలో పండించే కుసుమకు విత్తనం, ఎరువులపై రాయితీ కల్పించి మద్దతు ధరను ప్రకటిస్తే సాగు పెరుగుతుందని చెప్పారు. అంతే కాకుండా వ్యవసాయ అధికారులు సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు.

ఔషధ గుణాలు..

కుసుమ రేకుల్లో ఉన్న ఔషధ గుణాలపై అవగాహన కల్పించడం వలన పూరేకులకు కూడా మార్కెట్లో డిమాండ్ పెరుగుతుంది. కుసుమ రేకులతో డికాషన్ చేసి (తేయాకు బదులుగా) సేవించడం వలన ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అంతే కాకుండా 1. రక్తపోటు ఆదుపులో ఉంటుంది. 2.రక్తంలో కిలో ప్లాస్ తగ్గుతుంది. 3.కీళ్ల, మెడ నొప్పులను తగ్గిస్తుంది. 4.గుండెకు రక్తాన్ని తీసుకు వెళ్లే రక్తనాళాలను వ్యాకోచింప చేయడం వలన రక్తపోటును తగ్గిస్తుందని పలు పరిశోధనల్లో తేలింది. కుసుమలో పూర్తిగా పువ్వు విప్పుకున్న దగ్గర్నుంచి 15–20రోజుల తర్వాత వడలి పోయిన పూరేకులను కోయడం వలన ఆధిక పూత దిగుబడి సాధించవచ్చు. మరీ ఆలస్యం అయితే పూతలో తేమ శాతం తగ్గి కోసేటప్పుడు పొడిగా మారి కింద రాలిపోతాయి.

యువతే నా బలం.. బలగం

- ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలి
- 30 రోజులు నాకోసం పనిచేస్తే..
- ఐదేళ్లు మీకోసం పనిచేస్తా
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: యువతే నాబలం... బలగమని ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి అన్నారు. యువకులు రాజకీయాల్లోకి రావాలనే తపనతోనే తాను ఇన్నేళ్లు కష్టపడి ఎమ్మెల్యే స్థానంలో ఉన్నానని తెలిపారు. శుక్రవారం ఆయన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని యూత్ లీడర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత తలచుకుంటే ఏదైనా సాధించవచ్చన్నారు. యువ శక్తి ముందు ఏదీ పనికి రాదని వ్యాఖ్యానించారు. అలాంటి యువత తనతో నడుస్తున్నందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేసి బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తనను మరోసారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. 30 రోజుల పాటు మీరు కష్టపడితే, మీకోసం నేను ఐదేళ్లు కష్టపడతానన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన పథకాలతో పాటు, నూతనంగా మేనిఫెస్టోలో పొందుపరిచిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం పలువురు యువకులు మాట్లాడుతూ రాముడి విజయానికి హనుమంతుడు ఎలా కృషి చేశాడో, రోహితన్న గెలుపు కోసం తాము కూడా పని చేస్తామని ప్రకటించారు.

ముమ్మరంగా తనిఖీలు

వికారాబాద్ అర్బన్: సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల తనిఖీల్లో సాయుధ బలగాలు పాల్గొన్నాయి. కార్లు, ద్విచక్ర వాహనాలను పరిశీలించారు.

నూతన గ్రామ కమిటీ ఎన్నిక



నియామక పత్రాన్ని అందజేస్తున్న అంబేద్కర్ సంఘం నేతలు

దోమ: దిర్సంపల్లి అంబేద్కర్ సంఘం నూతన గ్రామ కమిటీని ఆ సంఘం తాలూక నేతలు శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా శ్రీను, మీడియా కన్వీనర్‌గా హన్మంతు, ప్రధానకార్యదర్శిగా బాలకృష్ణ, కార్యదర్శిగా వెంకటయ్య, సంస్కృతిక కార్యదర్శిగా స్వామి, ప్రచార కార్యదర్శిగా బందెయ్య, క్రీడా కార్యదర్శిగా తిరుమలేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేశ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా శ్రీశైలం, శివకుమార్, వేణుగోపాల్, యా దయ్య, రమేశ్, సత్యం, రవి, సలహాదారులుగా విజయేందర్, మొగులయ్య, వెంకటయ్య, నర్సింహులు, బాబు, శ్రీనులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆంజనేయులుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

సీఐ రాజేందర్ రెడ్డి

తాండూరు టౌన్: శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయమని తాండూరు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు పోలీసు వ్యవస్థ పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసుల మధ్య కమ్యూనికేషన్, వైర్‌లెస్ సెట్ వినియోగం, నేరపరిశోధన, దర్యాప్తు, తుపాకుల వినియోగంతో పాటు పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. చట్టం ప్రకా రం నేరాలను అదుపు చేయడం, నేరస్థులకు శిక్ష పడేలా చూడడం పోలీసుల కర్తవ్యమన్నారు. భవి ష్యత్‌లో విద్యార్థులు పోలీసు శాఖలో చేరాలని కోరారు.

మానవతాదృక్పథంతో..



ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: గ్రామాల్లో మానవతాదృక్పథంతో వ్యాపారాలు నిర్వహించాలని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన కుల్కచర్ల మండలం పుట్టపహడ్ గ్రామంలో శ్రీగురుకృప ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొని.. మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పంక్షన్‌హాల్‌లు అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. పేదలకు అనుకూలంగా వ్యాపారాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, రైతుబంధు కమిటీ అధ్యక్షుడు రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా

ఆర్డీఓ శ్రీనివాస్‌రావు



తనిఖీ చేస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

తాండూరు రూరల్: చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా పెట్టాలని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు ఆదేశించారు. శుక్రవారం కర్ణాటక–తెలంగాణ సరిహద్దులోని కోత్లాపూర్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల్లో నగదు, మద్యాన్ని అరికడతామని తెలిపారు. రూ.50 వేలకు పైన డబ్బు ఉంటే సీజ్ చేస్తామ ని చెప్పారు. కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ తారా సింగ్, డీఏఓ మహేశ్‌గౌడ్, ఆర్ఐ బాల్‌రాజ్, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెద్దేముల్: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన తట్టెపల్లి, హన్మాపూర్ గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ కిషన్ పర్యటించి, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఇందూరు, బండమీదిపల్లి, ఆత్కూర్, పాషాపూర్, ఓంలానాయక్‌తండా, గొట్లపల్లితో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో వసతుల ఏర్పాటుపై ఆయన ఆరా తీశారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తహసీల్దార్, ఎస్ఐ చర్చించారు.

ప్రత్యేక పూజలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయ ఆవరణలో వెలసిన పార్వతీమాత అమ్మవారికి శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, సుచిత్ర, రావులపల్లి సర్పంచ్ రమేశ్‌రెడ్డి, విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, లలితమ్మ దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విజయదశమి అనంతరం మొదటి శుక్రవారం రోజును పురస్కరించుకొని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అత్యంత భక్తి శ్రద్దలతో 9 రోజులు పాటు వివిధ అలంకరణలలో అమ్మవారు దరించిన చీరలు, శాలువాలను ఈ దంపతులకు అందజేశారు.

ఓటమి భయంతోనే ఫిర్యాదు

దౌల్తాబాద్: ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే సంక్షేమ పథకాలు ఆపాలని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, వెంకటేశ్, రాములు, సాయిలు తదితరులున్నారు.

గ్రామాల్లో సాయుధ బలగాల కవాతు



ధారూరులో కేంద్ర బలగాల కవాతు

ధారూరు: ఎన్నికల సందర్భంగా కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులు శుక్రవారం సంయుక్తంగా కవాతు నిర్వహించారు. ధారూరు, నాగసముందర్ గ్రామాల్లోని ప్రధాన మార్గాల్లో కవాతు ప్రదర్శించారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించినా, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ నర్సింలు, సీఐ రామకృష్ణ, సంతోశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు జన్మహక్కు

తహసీల్దారు వెంకటేశ్

బొంరాస్‌పేట: 18ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఓటు జన్మహక్కు అని తహసీల్దారు వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీ చేరికలు

- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో వలసలు
- అసెంబ్లీ ఎన్నికలే పార్టీల టార్గెట్



ప్రచారం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మోమిన్‌పేట: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రత్యర్థి పార్టీల్లోని కీలక నేతలను తమ పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటాపోటీగా ముందుకు సాగుతున్నాయి. మండలంలోని ప్రధాన పార్టీల్లో చేరికలు ఊపందుకున్నాయి. ప్రతిరోజు హస్తం, గులాబీపార్టీల్లో చేరుతున్న నేతల సంఖ్య అధికంగా ఉంటోంది. ఆ పార్టీ నుంచి ఈ పార్టీలోకి.. ఈ పార్టీ నుంచి ఆ పార్టీలోకి చేరికలు ఓ తంతుగా కొనసాగుతున్నాయి. ఇటీవల ఇజ్రాచిట్టంపల్లి గ్రామంలో ఉదయం కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు.. మరుసటి రోజు బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో ఎవరు ఏ పార్టీలో ఉన్నారో తెలియని పరిస్థితి మండలంలో నెలకొంది.

బీఆర్ఎస్‌లోకి సర్పంచ్

మోమిన్‌పేట సర్పంచ్ అంగేరి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో శుక్రవారం గులాబీ కండువా కప్పుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి చంద్రశేఖర్‌కు మద్దతుగా నిలిచిన ఈయన.. తర్వాత జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించారు. అప్పటి నుంచి తటస్థంగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డి.. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరారని గులాబీ శ్రేణులు చెబుతున్నాయి. పార్టీలో చేరిన వెంటనే గడప గడపకు కేసీఆర్ భరోసా కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు.

బీఆర్ఎస్‌కు చరమగీతమే

- హస్తం పార్టీదే అధికారం
- గులాజీ పార్టీకి ఓటమి తప్పదు
- అవినీతి పాలనను అంతం చేస్తాం
- డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని డీసీసీబీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు మనోహర్‌రెడ్డి జోస్యం చెప్పారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని గ్రీన్‌సిటీలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం తాండూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అవినీతి పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో గులాబీ పార్టీకి ఓటమి తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులకు దక్కకుండా బీఆర్ఎస్ నాయకులనే ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, అబ్దుల్ రవూఫ్, మహిపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

పెద్దేముల్: తాండూరులో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం పెద్దేముల్ మండలంలోని గోపాల్‌పూర్, రుక్మాపూర్, తట్టెపల్లి, పాషాపూర్, మారేపల్లితో పాటు పలు గ్రామాల కాంగ్రెస్ ముఖ్య నాయకులు మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రాబోతుందని జోస్యం చెప్పారు. ప్రతి కార్యకర్త పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణరెడ్డి, మైపాల్‌రెడ్డి, బిచ్చప్ప, సాయన్న, గోపాల్ పాల్గొన్నారు.

'గ్యారంటీ'గా అమలు చేస్తాం

కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు సర్వేశ్



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.500 వందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు సర్వేశ్ ప్రకటించారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. పథకాల గురించి అధిష్టానం ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

కాంగ్రెస్‌లో చేరిక



మహిళలతో మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు

కొడంగల్: మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రావులపల్లి సర్పంచ్ రమేశ్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: మండల కేంద్రంలోని పలాన్ యూత్‌కు చెందిన ముస్లిం యువకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ధారూరు బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సద్దాంతో పాటు, పాలాన్ యూత్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ వికారాబాద్‌లోని తన నివాసంలో వీరందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు గఫార్ పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం

దౌల్తాబాద్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల పథకాలను మండలంలో ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టనున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, వెంకట్‌రెడ్డి, సత్యపాల్, అంజి, సాయిలు, మొగులప్ప తదితరులున్నారు.

విశ్వరూప సభను జయప్రదం చేయండి

బొంరాస్‌పేట: శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో చేపట్టిన మాదిగల విశ్వరూప సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాశ్ మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రథయాత్రను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో 33 జిల్లాలు, 119 నియోజకవర్గాల్లో సాగిన రథయాత్ర రేపు (ఆదివారం) మోమిన్‌పేటకు రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో కరపత్రాలు పంపిణీ చేశారు. మాదిగలు రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ తిరుపతి మాదిగ, రాములు మాదిగ, వెంకట్, నర్సింహులు తదితరులున్నారు.

బీఆర్ఎస్ కుట్రలు తగవు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట: బీఆర్ఎస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింహులుగౌడ్ మండిపడ్డారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏనెమీదితండాకు చెందిన డాక్యానాయక్ వ్యక్తిగత పనుల కోసం నగదును తీసుకెళ్తుండగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు పోలీసులకు సమాచారమిచ్చి.. అతడిని ఇరికించే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ఇలాంటి చర్యలు సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రాములుగౌడ్, రాజేశ్ రెడ్డి, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, డాక్యానాయక్ తదితరులున్నారు.